

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



## శీనిగాడూ - కెరీరూ - శోభంబాబూ

## (తొలి భాగం)

ఓ సుక్కురారం మధ్యాన్నం. కడుపులో చల్ల కదలకుండా ఆఫీసు ఛెయిర్‌లో సమాధి స్థితికి నాలుగు అంగుళాల దూరంలో ఉన్నాను. బైటనించి ఎండ, అద్దాల్లోంచి లోపలికొచ్చి నీరెండలా మారి *"వటపత్రశాయికీ.."* పాడుతోంది. ఇంతలో ఫోను మోగింది చీరెండలా. వళ్ళు మండింది. సుక్కురారం మధాన్నం నేను ఆఫీసులో ఉండడమే గొప్ప. అల్లాంటిది, మళ్ళీ ఫోన్లు కూడా ఎత్తాలంటే, ఎంత కష్టం. విసుక్కుంటూ ఫోనెత్తాను.

***"ఒరేయ్, అర్జెంటుగా నీ రెజ్యూం పంపించు.."*** అంది అవతలి గొంతు.

ఒక్కసారి అరికాలి మంట చొక్కా జేబులోకొచ్చింది.

***"రెజ్యూం ఏమిటా, నీ బూడిద.. రెజ్యూమే అనాలి"*** అన్నాను చిరాగ్గా.

***" మరిక్కడ అంతా రెజ్యూం అనే అంటారు..?"*** అన్నాడు వాడు సంజాయిషీ కొచ్చెనేస్తూ.

***"అలా అంటే నువ్వు తక్షణం ఆ ఉద్యోగం మారిపో, అసలు నన్నడిగితే ఆ వూరే మారిపో, దిక్కుమాలిన ఫ్రెండ్సూ నువ్వూను.., రెజ్యూం అంటే మళ్ళీ మొదలెట్టడం అని అర్థం.."*** అన్నాను ఓపిగ్గా.

***"మరి రెజ్యూమే అంటే.."*** అన్నాడు వాడు పసి కూనలా.

***" అడ్డవైన అబద్ధాలూ ఆడ్డం, ఈ భూభారాన్ని మనవే మోస్తున్నట్టు రాసుకోవడం.."*** అన్నాన్నేను.

అవతల ఫోను కట్టయింది. ఇవతల మూడు అయిపోయింది.

ఇంక ఈ వారానికి కాపలా చాలులే అని డబ్బా కట్టేయబోతుంటే **టింగు** మంటూ మా బాసుగాడినించి ఈ మెయిలు...***"ఈవారం నీవు ఏమి చేసితివో, ఏమి సాధించితివో, ఎందరివద్ద కప్పము వసూలు చేసితివో, ఎన్ని ఘనకార్యములు చేసితివో, పది వాక్యములు మించకుండా వ్రాసి పంపించునది, అప్పుడు నేను, పైన నీ పేరు తీసేసి, వాటిని***

***నా గొప్పలుగా పైవారికి విన్నవించుకొనెదను."*** అంటూ. వీడు **"పి.ఎం"** సర్టిఫికేషను నా ప్రాణానికొచ్చింది.., ఎంకి పెళ్ళి సుబ్బి ఛావు కొచినట్టు... అసలీడికి **"పి.ఎం"** అంటే ఏవిటో తెలీదు. మా చిన్నప్పుడు పి.ఎం అంటే **" పుల్లేటుక్కుర్రు మామ్మ గారు"** అని అర్థం. అయినా ఏం రాస్తాం ప్రతీ వారవ్వూ,చిరా..గ్గా... ఆఫీసుకొస్తాం, మీటింగులకెళతాం, పడుకుంటాం, కాఫీ తాగుతాం, ఇంటికెళిపోతాం. ఏం సాధిస్తాం? అదృష్టవంతులైతే ఇంట్లో పెళ్ళాన్ని సాధిస్తారు, మనకదీ లేదు కదా. ఉభయ భ్రష్టుత్వం పట్టిపోయాం కదా. ఇంకేం ఘనకార్యాలు చేస్తాం. ఇద్దరిని కన్నాం, చాలదూ. అయినా సరే, వాడి మాటెందుకు కాదనాలీ అనుకుని వారం మొత్తంలో చేసిన అడ్డమైన దండగపనులు ఓ అరడజను పోగేసి, వాటిగురించి రాసి పంపించేసా. పాపం వాడూ బతకాలికదా, పిల్లలు గలవాడు.

కట్ చేస్తే, శనివారం మధ్యాన్నం, భోజనానంతరం లేప్ టాప్ మొహాన్నేసుకుని కూచున్నా. పాత ఈమెయిల్సు డిలీట్ చేస్తుంటే మా ఆవిడ పక్కన్నించుని చూస్తోంది. చాలా మంది నా గత జన్మ నెచ్చెలులు **(అనగా ఆడవాళ్ళని అర్థం),** లింక్ డెన్ లో కనెక్ట్ అవమని బోలెడు రిక్వెష్టులు పంపించారు. ఓపికగా అవన్నీ డిలీట్ చేస్తున్నాను.

***"అదేవిటీ, వాళ్ళంతా మీతో చదువుకున్న వాళ్ళూ, మీతో ఉద్యోగం చేసినవాళ్ళూ కదా, వాళ్ళు కనెక్ట్ అవమంటే అలా డిలీట్ చేస్తున్నారేవిటీ?"*** అంది ఆందోళనగా.

***"నాకు సిగ్గు బాబూ..."*** అన్నాను నేను బుగ్గలు పింక్ గా చేసుకుని.

***"వాళ్ళు కనెక్ట్ అవ్వమన్నది పెర్సనల్ గా కాదు, ప్రొఫెషనల్ గా, మీ సిగ్గు శివుడెత్తుకెళ్ళ.., రేప్పొద్దున్న ఓ మంచి రోజు చూసి, మీవాడు ఉజ్జోగం పీకేసాడనుకోండి...వీళ్ళే గతి. అంచేత ఇలాంటి మొహమాటాలేం పెట్టుకోకుండా రెజ్యూమే లిఖించి, కనెక్టవ్వండి, మరేంభయంలేదు.."*** అంది నవ్వుతూ.

***"నీ నోట్లో పంచదార పొయ్య, ఎంత సొగసుగా చెప్పావే, అమెరికా మొత్తం మీద నీలాంటి నలుగురు పతివ్రతలుండబట్టే , భూమ్మీద నాలుగు వానలు పడుతున్నాయింకాను.."*** అనేసి, మేడమీదకెళిపోయా కునుకు తియ్యడానికి.

మంచమ్మీద అటూ ఇటూ దొర్లుతున్నానే గానీ, నిద్ర పట్టి ఛావట్లేదు. ఈ మధ్య ఇంట్లో నిద్ర అలవాటు పోతున్నట్టుంది. కాసేపు ఆఫీసుకెళ్ళి పడుకునొద్దావా అని అనిపించింది గానీ, దూరవని మానేసాను. బుర్రలో అంతా, ***"రెజ్యూమే, కెరీరు"*** అనే బూతు మాటలే తిరుగుతున్నాయి. ఏవిటో...**రెజ్యూమే ఒక మాయ, కెరీరు ఒక మిధ్య.** ఎగిరే గాలిపటానికి దారం ఆధారవట, మరి మనలాంటి గాలిగాళ్ళకి, సుడే ఆధారం. జీవితంలో ఏదో అవాలనికోవడం, అదే అవ్వడం ఒక ఎత్తు. ఒకటవ్వాలనుకుని మరొకటవ్వడం ఇంకో ఎత్తు. అసలు ఏవీ అవ్వాలని అనుకోకపోవడం, అన్నీ అవ్వాలనుకోవడం అసలైన ఎత్తు. నామటుక్కు నాకు రేపటిగురించి ఎప్పుడూ చింతలేదు, చిన్నప్పటినించీని. నాలాంటి వాణ్ణి వదిలించుకుని భూమ్మీద పడెయ్యడానికి ఆ దేవుడు ఎంత క్షోభననుభవించాడో నాకు తెలుసు. నాకేదైనా కష్టం కలిగిస్తే,

పొరపాట్న నేను రిటర్న్ టిక్కెట్టు కొనుక్కొని వచ్చేస్తే, ఆయనకి చచ్చే చావు. అంచేత నన్నిక్కడే ఉంచి, ఆరారగా నాక్కావలసిన వన్నీ ఇచ్చి, గారం చేస్తున్నాడు. అందుకని అయాంబాబుగారు, చిన్నప్పటినించీ చాలా చాలా అవ్వాలని అనుకోవడం, మధ్య మధ్యలో ప్రాణం విసుగెత్తి ఏవీ కాకూడదనుకోవడం.. ఇలా గడిపేసాం ఇప్పుడిదాకా.

చిన్నప్పుడు మాపక్కింటి అమ్మాయి నన్నెత్తుకుని

***"చీనూ, చీనూ.., నువ్వు పెద్దయ్యాకా ఏమవుతావమ్మా.."*** అంది ముద్దుచేస్తూ.

నాలుగేళ్ళ శీనిగాడంటే మజాకానా? ***"నేను శోహన్ బాబూ, నువ్వు జయప్పెలా..."*** అన్నాను ముద్దుగా.

నా శోభన్ బాబు సంగతెలా వున్నా, తనని జయప్రదతో పోల్చేసరికి, సిగ్గులమొగ్గ అయిపోయి, నాకు మూడు ముద్దులెట్టేసి, ఆరు చాక్లెట్లిచ్చేసింది. కొన్నేళ్ళకి, పెద్దయ్యాకా అయాంబాబుగారు ఏమవుతారు అన్న అనుమానం ఇంట్లోవాళ్ళకీ వచ్చింది.

***"నేను డాక్టర్ ని అవుతా..."*** అన్నాను కాస్త వినడానికి ఘనంగా ఉండాలని.

పక్కనే కూచున్న పేరూరు తాత ఒకాయన ***"అబ్బే,వీడి మొహం, వీడికంత కెపాషిటీ లేదు..., వీడు మేష్టారవుతాడు.."*** అని దీవించాడు. ఆయన గుండుమీద ఒక్క గుద్దు గుద్దాలనిపించింది. అయినా ఎనిమిదేళ్ళ కుర్రాడి కెపాషిటీ, ఎనభయ్యేళ్ళ తాత ఎలా డిసైడ్ చేసాడో నాకిప్పటికీ అర్థం కాదు.

ఓసారి మైకిచ్చుకుని ఘంటసాలగారి వర్ధంతి రోజున భగవద్గీత పద్యాలు చెప్పాను. ***"ఆయన పోయాడు కాబట్టి, బతికిపోయాడు.."*** అన్నారు నాన్న.

**"అదేవిటండీ, బానే పాడాడు కదా పిల్లాడు, కొన్నాళ్ళకి గొంతు విడుతుంది"** అన్నారు విన్నవాళ్ళు.

***"నీగొంతు మైకు కి సూటు కాదురా..."*** అనేసారు అధాట్టున.

***" అయితే సూటయ్యే మైకు చేయించుకుందాం.."*** అనేసి భవిష్యత్తులోకి అడుగెట్టాను.

పదోతరగతి దాటాకా, హైదరాబాదులో మాపక్కింట్లో ఉండే అరవ అంకుల్ బాలసుబ్రమణియన్ గారిని చూసి, ముఖ్యంగా ఆయన **కోటు** చూసి, రైల్వేస్ లో టికెట్ కలెక్టర్ అవ్వాలనుకున్నా. ***'ఓ వర్షం కురుస్తున్న రాత్రి, సర్కార్ ఎక్స్ ప్రెస్ బోగీలో సింగిల్ సీటులో నేను, అటు పక్క పెద్దసీటులో ఓ వీరోయిన్నూ. నలుగురు విలన్ గాళ్ళు వచ్చి ఆమెని అల్లరి పెట్టడం, మనం టీషర్టుతో రంగంలోకి దిగి, వాళ్ళ దుమ్ము దులిపేసి, ఆనక తీరిగ్గా, క్రాపు సద్దుకుని, కోటేసుకుని, ఆమెకి షేక్ హేండిచ్చి, పరిచయం చేసుకుని, పార్వతీపురం అడవుల్లో "అచ్చా అచ్చా." అనుకుంటూ ఒకపాట..*** ఇలా ఎన్నో ఊహించుకున్నాను. అవన్నీ విని ఆ బాలసుబ్రమణియన్ గారు నవ్వి ***"ఇంద మాదిరి వుండదు ఆండవనే, నన్ను దా నమ్ము,***

***నేను ఇవన్నీ బోగీలో సేస్తే, నన్ను జాబులోంచి డిస్మిస్ సేస్తురు, తీసి పూడుస్తురు."*** అని ఒట్టేసి మరీ చెప్పారు. ఇంకెందుకూ ఈ ఉజ్జోగం, పూడ్చడానికా.. అనుకుంటూ ఆ కెరీర్ కలని ఫస్ట్ రీల్‌లోనే కట్ చేసేసా.

**(వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)**

POST YOUR COMMENTS